క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు) : నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య సోమవారం పరిశీలించారు. స్థానిక ముత్తుకూరు రోడ్డు, మినీబైపాస్ రోడ్డు, ఆత్మకూరు బస్టాండ్, రైల్వేస్టేషన్ రోడ్డు, బట్వాడిపాళెం తదితర ప్రాంతాల్లో పర్యటించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కుష్టు రహిత సమాజానికి కృషి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్) : కుష్టు(లెప్రసీ) రహిత సమాజం కోసం వైద్యసిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, కుష్టు, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. ఆయన తన చాంబర్‌లో డిసెంబర్ మాసానికి సంబంధించిన కుష్టు నివారణ పురోగతిపై సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కుష్టుకు సంబంధించి వచ్చే నెల జనవరి 20వ తేదీ నుంచి జిల్లాలో జరిగే ఎల్‌సీడీసీ ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రబాబు, ఫిజియోథెరపిస్ట్‌లు నరసింహులు, మల్లమ్మ, ప్రసాదాచారి పాల్గొన్నారు.

ఆదాయ మార్గాలను అన్వేషించాలి

నెల్లూరు(బారకాసు) : ఆదాయ వనరులను సృష్టించుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. నగరంలోని నుడా కార్యాలయంలో సోమవారం అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నుడా ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అవసరమని తెలిపారు. కందుకూరుతో పాటు కావలిలో ఏర్పాటు చేసిన ఎంఐజీ లేఅవుట్ స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కావలితో పాటు పలు చోట్ల ప్రభుత్వ లేదా ప్రైవేట్ స్థలాలు తీసుకుని అభివృద్ధి చేయాలన్నారు. వాటిల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నుడా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞత ఆరాధన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని బాప్టిస్టు చర్చి డానీ హాల్లో సోమవారం నిర్వహించిన కృతజ్ఞత ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. ఎవాంజలిజం డైరెక్టర్ గంటా జార్జ్ స్టీవెన్‌సన్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సంఘ కాపరి కె.శ్యాంసన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, కృపారాజన్ పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా శ్రీనివాసులు



శ్రీనివాసులును సత్కరిస్తున్న పార్టీ నేతలు

నెల్లూరురూరల్ : బీవీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏఆర్‌ఓ వెంపలూరి భాస్కర్‌గౌడ్, మండల ఆర్వో మారుబోయిన శ్రీనివాసులు మండల ఎన్నికను సోమవారం నిర్వహించారు. గుంజి శ్రీనివాసులును ఏకగ్రీవంగా బీవీనగర్ మండలాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రబోలు రాజేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోసూరు బాలయ్యగౌడ్, సీనియర్ నేత గెట్టిబోయిన పెద్ద రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రేబాల వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రహ్మద్‌బాషా అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన రహ్మద్‌బాషా నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో ఉంటున్నాడు. టైల్స్ పనిచేసే రహ్మద్‌బాషా ప్రతిరోజూ బుచ్చిరెడ్డిపాళెం వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో అతను బైక్‌పై నెల్లూరు వెళ్తున్న సమయంలో పల్లె వెలుగు ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొని పడిపోయాడు. అదే సమయంలో బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కూరగాయల వ్యాన్ రహ్మద్‌బాషా కాళ్లమీద నుంచి వెళ్లడంతో తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు 108 ద్వారా అతన్ని బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

ట్రాఫిక్ జటిలం..
మారాలి మనం

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు మరింత జటిలంగా మారుతోంది. ఓ వైపు పెరుగుతున్న వాహనాల సంఖ్యతో పాటు ప్రజలు కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం మరో పెద్ద సమస్యగా మారుతోంది. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేయగా, వాటిని కూడా వాహనదారులు లెక్కచేయకుండా పక్కకు జరిపి వెళ్లిపోతున్నారు. దీనివల్ల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. నగరంలో ప్రధానమైన వీఆర్సీ కూడలిలో వన్ వే ద్వారా వాహన రాకపోకలు సాగిస్తాయి. దీనికి ఆటంకం రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లను వాహనదారులు జరిపి వెళ్తుండడం వల్ల ఏర్పడిన ట్రాఫిక్ సమస్యపై సోమవారం సాక్షి క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



బారికేడ్లను జరిపి వెళ్తున్న వాహనదారులు



ట్రాఫిక్ పోలీస్ ఉన్నా.. రాంగ్ రూట్‌లో ప్రయాణం



మద్రాస్ బస్టాండ్ నుంచి వీఆర్సీ సెంటర్‌కు వచ్చే ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

సమస్యలపై హెల్ప్‌లైన్‌కు తెలపండి

- కమిషనర్ సూర్యతేజ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : స్థానిక సమస్యలను హెల్ప్‌లైన్(94940 18118)కు తెలియజేస్తే తక్షణమే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఇందులో కమిషనర్ పాల్గొని, అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర వ్యాప్తంగా రోడ్ల మరమ్మతు పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని ఆదేశించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ విభాగంలో సీసీ కెమెరాల పర్యవేక్షణను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేయడాన్ని గుర్తించి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం 46 ఫిర్యాదులు రాగా, అందులో విభాగాల వారీగా ఆప్కాస్ 2, ఇంజినీరింగ్ 9, హౌసింగ్ 30, పబ్లిక్ హెల్త్ 1, టౌన్‌ప్లానింగ్ 4 చొప్పున అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ నందన్, ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, డీసీపీ పద్మజతో పాటు ఇతర విభాగాలధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది మృతిపై విచారణ జరపాలి



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదుల

నెల్లూరు (లీగల్) : అనంతపురంలో సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రి మృతిపై విచారణ జరపాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అంకయ్య, రమేష్ డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో వారు సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో శేషాద్రి మృతిచెందడం బాధాకరమైన విషయమని, దీనికి కారకులు అయిన అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ అధికారి, సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, అలాగే లక్కిరెడ్డిపల్లి పోలీసులు న్యాయవాది జె.సుదర్శన్‌రెడ్డి పట్ల వ్యవహరించిన అమానుష చర్యపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ కార్యదర్శి జి.బాలసుబ్రహ్మణ్యం, విజయమోహన్‌రెడ్డి, జల్లి పద్మాకర్, కాకు మురళిరెడ్డి, లక్ష్మీనారాయణ, సుభాన్, శ్వేత, రుహి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌కు గట్టి భద్రత

నెల్లూరు సిటీ : ఈవీఎం గోడౌన్ వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. గోడౌన్ పరిసరాల్లో భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీఓ అనూష, తహసీల్దార్ షఫీమాలిక్, డీటీ అశోక్‌వర్ధన్, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్ వద్ద కలెక్టర్, అధికారులు

మహిళలకు ప్రత్యేక క్యూలైన్ కావాలి

నెల్లూరురూరల్ : జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని గ్రామాల నుంచి వచ్చిన మహిళలు కోరుతున్నారు. పురుషులు తోసుకుంటూ రావడం వల్ల ఇబ్బంది కలుగుతోందని, దీనివల్ల వెనుక వచ్చి మౌనంగా కూర్చుని తరువాత వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలకు వచ్చినా మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి చూడాల్సి వస్తోందని వాపోయారు. ఉదయం వస్తే సాయంత్రం ఇంటికి వెళ్తున్నామని, దీనిపై అధికారులు స్పందించి మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని కోరారు.



అర్జీలు రాసే ప్రాంతంలో నెలకొన్న రద్దీ

పాఠశాలలో పుస్తక ప్రదర్శన

నెల్లూరు (టౌన్) : స్థానిక తురిమెల నాగిరెడ్డి పాఠశాలలో సోమవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మణి బుక్‌స్టాల్ నిర్వాహకుడు మల్లికార్జున మాట్లాడుతూ నూతన సంవత్సరానికి బంధువులు, మిత్రులకు మంచి పుస్తకంతో శుభాకాంక్షలు తెలియజేయాలని తెలిపారు. పుస్తక ప్రదర్శన మంగళవారం కూడా ఉంటుందన్నారు.



అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ, పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేడ్కర్‌పై అహంకార పూరిత, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దీనిపై అన్నివర్గాల ప్రజలు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, సీపీఎం జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, అజయ్ కుమార్, పుల్లయ్య, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, శ్రీనివాసులు, సీపీఐ నేతలు వినోదిని, రాంబాబు, తిరుపాలు, సిరాజ్ తదితరులు, పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, మైపాడు రోడ్డు, వేణుగోపాల్ నగర్, అరవిందనగర్, సింహపురి కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈహెచ్‌ఎస్ సేవలను ప్రదర్శించాలి



సుధీర్‌కుమార్‌కు వినతి పత్రం అందజేత

నెల్లూరు(అర్బన్) : ఈహెచ్‌ఎస్ ద్వారా అందే సేవల గురించి కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు బోర్డుల్లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్‌ను నగరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ఉద్యోగులకు నగదు రహిత సేవలందించడంలో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. అందువల్ల జబ్బుల వివరాలు.. నగదు రహిత సేవల గురించి బోర్డుల్లో ప్రదర్శించాలన్నారు. అలాగే ఆపరేషన్లు, ప్రొసీజర్స్‌లో కూడా ఇబ్బందులు రాకుండా యాజమాన్యాలతో మాట్లాడాలని కోరారు. దీనిపై సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఎంపానెల్ పొందిన ఆస్పత్రులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అసోసియేషన్ నాయకులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, హెల్త్, వెల్‌నెస్ సెంటర్స్ జిల్లా అధికారి వెంకటమురళి, టీమ్ లీడర్స్ దశరథరామిరెడ్డి, మధు, కోటేశ్వరరావు, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

46,963 మందికి పింఛన్లు

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 46,963 మందికి మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి తగిన చర్యలు చేపట్టినట్లు కమిషనర్ సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూరు శాతం పంపిణీ లక్ష్యమన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి



సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న అధికారులు



దర్గామిట్ట జెడ్పీ విద్యార్థులకు అభినందన

నెల్లూరు (టౌన్) : విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం రూరల్ మండలంలోని పాఠశాలల సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఇందులో వ్యక్తిగత విభాగంలో 13, గ్రూపు స్థాయిలో 17, ఉపాధ్యాయ స్థాయిలో 7 ప్రదర్శనలు జరిగాయి. వ్యక్తిగత స్థాయిలో దర్గామిట్టలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి నాయబ్ రసూల్, గ్రూపుస్థాయిలో దర్గామిట్ట జెడ్పీహెచ్‌ఎస్ నుంచి సందీప్, బ్రహ్మనిఖిల్, ఉపాధ్యాయ స్థాయిలో పెనుబర్తి జెడ్పీహెచ్‌ఎస్ ఎన్.శ్రీనివాసులు తయారు చేసిన ప్రాజెక్టులను జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓ మురళీధర్ పాల్గొన్నారు.

– కాగా నాయిబ్ రసూల్‌తో పాటు బ్రహ్మనిఖిల్, సందీప్‌లను పాఠశాలలో సోమవారం అభినందించారు. హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ క్యాలెండర్ల ఆవిష్కరణ



ఇరిగేషన్ కార్యాలయంలో..



ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..



జేవీవీ ఆధ్వర్యంలో..



కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఏపీ ఇరిగేషన్ ఎన్జీఓ అసోసియేషన్ నెల్లూరు యూనిట్ 2025 టేబుల్ క్యాలెండర్‌ను నగరంలోని రామలింగాపురంలో ఉన్న ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. పర్యవేక్షక ఇంజినీర్ దేశ్‌నాయక్ దీనిని విడుదల చేశారు. కార్యక్రమంలో సర్కిల్ యూనిట్ అధ్యక్షుడు కె.విజయకుమార్, కార్యదర్శి పి.రామచంద్రయ్య, కోశాధికారి సాధు సుబ్బరామయ్య, గౌరవాధ్యక్షుడు పి.రవికుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ వీవీ శివప్రసాద్, మహిళా సంయుక్త కార్యదర్శి పి.గీత, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్) : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌తో పాటు డైరీని డీఈఓ ఆర్.బాలాజీరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు, రాష్ట్ర సబ్ కమిటీ సభ్యుడు రియాజ్, ఫెడరేషన్ బాధ్యులు రాజశేఖర్, మురళీకృష్ణ, రామసుబ్బారెడ్డి, రవి, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గుప్తా, సురేష్, శివకుమార్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రత్నయ్య, శ్రీనివాసులు, వెంగబాబు, మహేష్, రత్నారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

– నెల్లూరు(అర్బన్) : జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్–2025ను హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, హెచ్‌ఎంల సంఘం నాయకుడు ఎమ్వీ చలపతి మాట్లాడుతూ శాస్త్రీయ సమాజం కోసం జేవీవీ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉదయభాస్కర్, కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనునాయక్, పోతంశెట్టి విద్యాచరణ్, మోహన్‌రెడ్డి, అడ్వొకేట్ అంకయ్య, కృష్ణారావు, కరిముల్లా, దాస్ పాల్గొన్నారు.

– నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్‌కేబీ చారిటబుల్ ఫౌండేషన్, ఇందిరాగాంధీ మైనారిటీ సేవాసదన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి చేతుల మీదుగా చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులోని ఆయన నివాసంలో విడుదల చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్, చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ అల్లావుద్దీన్, నాయకులు శ్రీనివాసులురెడ్డి, రెహమాన్, హనీఫ్, బ్రహ్మయ్య, కరిముల్లా, బాబి, చాన్‌బాషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పశువులు కనిపిస్తే గోశాలకు తరలిస్తాం

నెల్లూరు(బారకాసు) : ప్రధాన రోడ్లపై పశువులు కనిపిస్తే గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ధనలక్ష్మీపురం, మద్రాసుబస్టాండ్, ఫత్తేఖాన్‌పేట ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న నాలుగు పశువులను సోమవారం గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల యజమానులు బాధ్యతతో వ్యవహరించాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు.



ఆవులను పట్టుకునేందుకు యత్నిస్తున్న సిబ్బంది

వాకర్స్ సమావేశం

నెల్లూరు(బారకాసు) : వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ కార్యక్రమాన్ని సోమవారం ఏలూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్‌గా నలుబోలు బలరామయ్యనాయుడు నియమితులయ్యారు.